క్లుప్తంగా

హెల్త్ సెంటర్ నిర్మాణ స్థలం పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని 1, 2వ వార్డుల ప్రజల కోసం ఇల్లెందులపాడులో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్ కటకం పద్మావతి ఇల్లెందులపాడులోని హనుమాన్ టెంపుల్ వెనక ఖాళీ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. స్థానికులు ఈ స్థలం అనువుగా ఉంటుందని సమ్మతించారు. ఈ నెల 24న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుందని సమాచారం.

పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఇల్లెందు: నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇల్లెందులోని జేబీఎస్ హైస్కూల్, జేకే సింగరేణి హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 6వ తరగతిలో ప్రవేశానికి జరుగుతున్న ఈ పరీక్షకు 386 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని ఎంఈఓ టీవీఆర్ఎస్ స్వామి తెలిపారు.

అనాథాశ్రమాల సందర్శన

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని స్నేహలత, సంధ్యాలత, జ్యోతి అనాథాశ్రమాలను శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సందర్శించారు. మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాలతో ఆశ్రమాలను సందర్శించినట్లు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా రమాదేవి

కొత్తగూడెంఅర్బన్: మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా వంగర రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల హనుమంతరావు అధ్యక్షతన ఎన్నిక జరిగింది. కాళ్ల ఎల్లయ్య, బి.అంజయ్య, గౌరీశంకర్, సత్యభామ పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం ఎన్నిక

ఇల్లెందు: నిన్నటి వరకు ఎన్డీలో రెండువర్గాలుగా ఉండి ఇటీవల ఒకే ఎన్డీగా ఆవిర్భవించిన విషయం విధితమే. ఎన్డీకి అనుబంధంగా ఉన్న అఖిల భారత రైతు కూలీ సంఘం కూడా రెండుగా ఉండగా శుక్రవారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో సమావేశమై రైతు కూలీ సంఘాల విలీన ప్రకటన చేశారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా ఇల్లెందుకు చెందిన తుపాకుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఏనుగు చంద్రం, ఉపాధ్యక్షుడిగా బట్టు ప్రసాద్, జక్కుల రాంబాబు, సహాయ కార్యదర్శులుగా భూక్యా హర్జ్యా, కుంజ కృష్ణ, కోషాధికారిగా బచ్చలి సారయ్యలతో పాటు 25 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలు ఆమోదించారు. ఫిబ్రవరి 20న రైతు సమస్యలపై చలో హైదరాబాద్ నిర్వహించాలని కోరారు.

మచ్చలేని నాయకుడు జ్యోతిబసు

సింగరేణి(కొత్తగూడెం): మచ్చలేని మార్కిస్ట్ మహానాయకుడు జ్యోతిబసు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మంచికంటి భవన్‌లో సీపీఎం మొదటి బ్యూరో సభ్యుడు, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు 15వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..

కొత్తగూడెంటౌన్: ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రామవరం టూటౌన్ ఎస్సై బి.శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం రుద్రంపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు. మాట్లాడుతూ... ప్రతీఒక్కరు బాధ్యతగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిబంధనలు పాటించాలన్నారు.

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరుతూ అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఫరూక్ హెల్మెట్ లేని వాహనదారులకు గులాబీ పువ్వులను అందజేశారు. నాగారం కాలనీ సమీపంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం వాహనదారులకు అవగాహన కల్పించారు.

జీపీ కార్మికుడు మృతి

ఇల్లెందురూరల్: పోలారం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ జటంగి వెంకన్న (57) బ్రెయిన్ స్ట్రోక్‌తో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మూడు రోజుల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన ఆయన ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పంచాయతీ కార్మికుడిగా 30ఏళ్లుగా పనిచేసిన వెంకన్న ప్రస్తుతం న్యూడెమోక్రసీ అనుబంధ ప్రగతిశీల పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు.

ఓసీ నిర్వాసితులపై మౌనమేల ?

- ఆవిర్భావ సేవలకు ఇదేనా సత్కారం!
- నేడు నిరాశ్రయులను చేస్తున్న ఓసీ విస్తరణ
- భయంభయంగా 21పిట్ ఏరియా ప్రజలు
- నిర్వాసితులకు ప్యాకేజీపై కొరవడిన స్పష్టత

సింగరేణి సంస్థ ఆవిర్భావం నాటి తీపి గుర్తులకు ఆలవాలమైన 21పిట్ ఏరియా భవిష్యత్ నేడు ఆగమ్యగోచరంగా మారింది. ఇక్కడ సింగరేణి ఆవిర్భావం నాటి బొగ్గు గనులు ఒక్కొక్కటిగా మూతపడ్డాయి. దీంతో జేకే ఓసీ పేరుతో బొగ్గు వెలికితీసేందుకు యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకు పర్యావరణ అనుమతి మినహా ఇతర అనుమతులు పొందిన యాజమాన్యం ప్రారంభానికి సన్నాహాలు చేస్తోంది. కానీ నిర్వాసితులుగా మారుతున్న స్థానికులకు పరిహారంపై మౌనం పాటిస్తోంది. దీంతో ఆవిర్భావ సేవలకు యాజమాన్యం అందిస్తున్న సత్కారం ఇదేనా అంటూ స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఆవిర్భావ సమయంలో బొగ్గు తవ్వకాలు ప్రస్తుత 21పిట్ ఏరియా సమీపంలోని పూసపల్లి గ్రామ శివారులో ప్రారంభమయ్యాయి. తీపిగుర్తుగా సింగరేణి యాజమాన్యం ఇక్కడే పైలాన్ కూడా నిర్మించింది. ఆ సమయంలో కార్మికులు భూగర్భంలో పనిచేస్తూ ప్రస్తుత 21పిట్ ఏరియాగా పిలవబడే ప్రాంతంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. యాజమాన్యం వారి కష్టాలను చూసి పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించింది. దీంతో నాటి కార్మికులు, పరిశ్రమపై ఆధారపడి జీవించిన కుటుంబాలు ఇక్కడే పెంకుటిళ్లు, గడ్డి ఇళ్లను నిర్మించుకున్నాయి. ఆ తరువాత 1960లో ఇదే ప్రాంతంలో సింగరేణి యాజమాన్యం కార్మికుల కోసం క్వార్టర్లను నిర్మించింది. ఇలా యాజమాన్యం నిర్మించిన తొలి కార్మికవాడ 21పిట్ ఏరియాలో వందల సంఖ్యలో కార్మికులు నివాసం ఉండేవారు.

వందేళ్లుగా ఇక్కడే నివాసం..

ఇల్లెందు ఏరియాలో భూగర్భ గనులు మూసివేయడంతో సింగరేణి కార్మికులు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. 21పిట్ భూగర్భ గని మూసివేతతో అరకొరగా ఉన్న కార్మికులకు కూడా బదిలీ తప్పలేదు. దీంతో మాజీ కార్మికుల కుటుంబాలు, సంస్థపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవనం సాగించిన కుటుంబాలే ప్రస్తుతం ఈ కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్లలో భయంభయంగా బతుకుతున్నారు.

యాజమాన్యం తీరుతో కలవరం..

ఇల్లెందు ఏరియాలో ఇప్పటి వరకు కొనసాగిన జేకే-5 ఓసీ మనుగడ ప్రశ్నార్థకం కావడంతో సింగరేణి యాజమాన్యం సంస్థ పుట్టినింటిని మరికొంత కాలం నిలబెట్టేలా ఓసీ విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా 21పిట్ ఏరియాలో 186 ఇళ్లను ప్రస్తుతానికి నిర్వాసితులుగా యాజమాన్యం గుర్తించింది. కానీ ప్యాకేజీ ఎలా చెల్లిస్తారో యాజమాన్యం నుంచి స్పష్టత లేదు.

అఖిలపక్ష కమిటీ కీలకపాత్ర...

అంతరించిపోయే స్థితికి చేరుకున్న 21పిట్ ఏరియాను రక్షించుకోవాలన్న సంకల్పంతో అఖిలపక్షం పేరుతో స్థానిక పెద్దలు కమిటీగా ఏర్పాటయ్యారు. వీరంతా సింగరణి ఏరియా ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశమై ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. దీంతో నిర్వాసితుల సర్వే పూర్తి చేసిన యాజమాన్యం వారి కోసం ప్రత్యేకంగా స్థలం పరిశీలించింది. కానీ నిర్వాసిత ప్యాకేజీపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. అంతే కాకుండా రెడ్ జోన్‌లో ఉన్న వారి పరిస్థితి, కూలేందుకు సిద్ధంగా ఉన్న క్వార్టర్లలో నివసిస్తున్న వారి భవిష్యత్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నేటికీ కనీసం తాత్కాలిక మరమ్మతు పనులకు కూడా అనుమతి ఇవ్వకపోవడంపై స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.



21పిట్ ఏరియా వ్యూ

వారే కార్మికులా.. మేము కాదా..?

తొలుత ఇల్లెందు ఏరియా 21పిట్ ఏరియాలో కార్మికుల కోసం క్వార్టర్లను నిర్మించిన యాజమాన్యం ఆ తరువాత క్వార్టర్లను ఇతర ఏరియాలలో నిర్మించింది. దశాబ్దాలు గడవడంతో నివాసయోగ్యంగా లేని క్వార్టర్లను కార్మికులకు సొంతం చేయాలని కార్మిక సంఘాలు, నివాసితుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో యాజమాన్యం మందమర్రి, శ్రీరాంపూర్ ప్రాంతాలలో పురాతన క్వార్టర్లను అక్కడే నివసిస్తున్న వారికి అప్పగించింది. కానీ సంస్థ ఆవిర్భావానికి తమ రెక్కల కష్టాన్ని త్యాగం చేసిన కార్మికులు, వారి వారసులు నివసిస్తున్న ఇల్లెందు ఏరియా 21పిట్ ఏరియాలో క్వార్టర్లను స్థానికంగా నివసిస్తున్న వారికి అప్పగించేందుకు యాజమాన్యం ఆంక్షలు విధించడంలో అంతర్యమేమిటో ప్రశ్నగా మారింది. ఈ తేడాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని అఖిలపక్ష కమిటీ స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లింది.

స్థానికులకే క్వార్టర్లు అప్పగించాలి..



మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలలో కార్మిక కుటుంబాలకు ఇచ్చిన సదుపాయాలను ఇల్లెందు ఏరియాలోనూ ఇవ్వాలి. సంస్థలో పనిచేసిన కార్మిక కుటుంబాలు, వారసులు, సంస్థపై ఆధారపడి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారికి క్వార్టర్లను స్వచ్ఛందంగా అప్పగించాలి.

– పూనెం కవిత, మాజీ సర్పంచ్, విజయలక్ష్మీనగర్

న్యాయం చేయాలి...



21పిట్ ఏరియాలో నివాసం ఉంటున్న ప్రజలందరికీ సింగరేణి యాజమాన్యం న్యాయం చేయాలి. స్థానికులకు క్వార్టర్లను సొంతానికి ఇవ్వడంతోపాటు నిర్వాసితులకు, రెడ్‌జోన్ బాధితులకు ప్యాకేజీ వర్తింపజేయాలి. ఏరియాలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలి.

– ధనసరి స్రవంతి, సర్పంచ్, తిలక్‌నగర్

20న మోటార్ కార్మికుల మహాసభ



సింగరేణి(కొత్తగూడెం): కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఈ నెల 20న ఇల్లెందు నియోజకవర్గం టేకులపల్లి సేవాలాల్ గుడి సెంటర్‌లో జరుగుతుందని కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. శుక్రవారం ఇల్లెందులోని బొగ్గు ట్రాన్స్‌పోర్టు ఆఫీస్, శ్రీదేవీ గ్యారేజ్, కొత్త బస్టాండ్ సెంటర్, ఆటో, టాటా మ్యాజిక్ అడ్డాల మీద మహాసభ విజయవంతానికి ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మల్లెల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రఘు, పిల్లి మల్లేష్, విజయ్, బాలు, రాజు, మౌర్య, కార్తీక్, రాంబాబు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

ఇల్లెందులోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఎన్డీ అనుబంధ ఇఫ్టూ సంఘాల విలీన సభ ఈ నెల 18న కొత్తగూడెంలో జరుగుతుందని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం కొత్త బస్టాండ్ సెంటర్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, ఆంజయ్య, ధనుంజయ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (టీపీఏఎండబ్ల్యూయూ) ప్రథమ జిల్లా మహాసభ ఈనెల 20న కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలోని సేవాలాల్ గుడి ఆవరణలో జరగనుందని, జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్, కోశాధికారి సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని ఆటో అడ్డాలో కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సింగరేణిలో ఉత్పత్తి ప్రారంభం అయిన నాటి నుంచి నేటి వరకు కోల్ ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్న డ్రైవర్లకు కనీస వేతనాలు చట్టబద్ధ హక్కులు అమలుకు నోచులోలేదని, లాభాలలో వాటా కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చినట్లు, టిప్పర్ డ్రైవర్లకు ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్ ప్రయాణంతో ఆటో, జీప్, క్యాబ్, మ్యాజిక్ రంగాల డ్రైవర్లు కుదేలైనట్లు చెప్పారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎం.చంద్రశేఖర్, కే.ప్రసాద్, రమేష్, ప్రమోదు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నాగేశ్వరరావు



టేకులపల్లి: ఐఎన్‌టీయూసీ యూనియన్ సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఇల్లెందు ఏరియా కోయగూడెం ఓపెన్ కాస్ట్‌కు చెందిన భూక్యా నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మాట్లాడుతూ... ఉద్యోగస్తుల హక్కుల కోసం, కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేస్తానన్నారు.

రోబోటిక్ సర్జరీతో ఉపయోగం

కొత్తగూడెంరూరల్: మోకాళ్లలో గుజ్జు అరుగుదలకు రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీతో ఎంతో ఉపయోగం ఉంటుందని యశోద ఆస్పత్రి సర్జన్ దాచనపల్లి సునీల్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని సూర్యా ప్యాలెస్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకాళ్ల అరుగుదలతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారని, మోకాళ్ల అరుగుదలకు రెండు స్టేజీలలో ఇంజిక్షన్ తీసుకోవచ్చని, చివరి స్టేజీలో శస్త్రచికిత్స అవసరం అని చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

జూలూరుపాడు: అనంతారం గ్రామంలో సాయిరాం ఆస్పత్రి ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. గడిచిన ఆరు నెలల్లో ఐదుగురు కిడ్నీ వ్యాధితో మృత్యువాతన పడటం, పలువురు కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో కాంగ్రెస్ నాయకుడు కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, రేపాల కోటేశ్వరరావులు చొరవతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌ను సీఐ ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు. ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయిరాం ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్లు విజేష్‌వర్మ, త్రిశూల్‌రెడ్డి, కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, ఎదళ్లపల్లి వీరభద్రం పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా చేపట్టాలి



ఇల్లెందురూరల్: బోయితండాలో సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: సంక్షేమ పథకాల అమలు లక్ష్యంగా నిర్వహిస్తున్న సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ రవికుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో సర్వేను శుక్రవారం వారు తనిఖీ చేశారు. రైతు భరోసాకు సాగు భూముల వివరాలు సేకరించి నమోదు చేసుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం కూలీల స్థితిగతులపై ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే మండలంలో తుది దశకు చేరుకుంది.

జూలూరుపాడు: ప్రభుత్వం ఈనెల 26 నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయనున్న క్రమంలో చేపట్టిన ఫీల్డ్ సర్వేను అధికారులు శుక్రవారం పరిశీలించారు. కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపికను పడమటనర్సాపురంలో ఇంటింటి సర్వేను జిల్లా పౌరసరఫరాల అధికారి, జూలూరుపాడు మండల ప్రత్యేక అధికారి రుక్మిణీదేవీ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించి, అర్హులను ఎంపిక చేయాలని సెక్రటరీని ఆదేశించారు. మాచినేనిపేటతండా, పాపకొల్లు గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ యోగ్యం కాని భూముల సర్వేను తహసీల్దార్ కె.స్వాతి బిందు, ఏఓ దీపక్ ఆనంద్ పరిశీలించారు.

పాల్వంచరూరల్: పునుకుల గ్రామపంచాయతీలో శుక్రవారం ప్రభుత్వ సంక్షేమ పథకాలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా తనిఖీని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, ఎంపీఓ బి.బాబూరావు, ఎస్.రాంబాబు ఉన్నారు. తోగ్గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సాగుచేయని బీడు భూములను సర్వే సంబర్ల ఆధారంగా తహసీల్దార్ వివేక్ పరిశీలించారు.

మానసిక, శారీరక దృఢత్వం తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంరూరల్: పోలీసు శాఖ ఉద్యోగులు మానసిక, శారీరకంగా దృఢత్వం కలిగి ఉంటే బాధ్యాతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించవచ్చని డీఎస్పీ రెహమాన్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలోని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ సిబ్బందికి ఇస్తున్న కోర్సు ముగియడంతో నిర్వహించిన పరేడ్‌ను డీఎస్పీ పరిశీలించి మాట్లాడారు. పదిహేను రోజుల శిక్షణలో పోలీసు శాఖలో కాలానుగుణంగా వస్తున్న మార్పులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఆర్ఐ లాల్‌బాబు, ఎంటీఓ సుధాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కాలనీలో జాతీయ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘ కార్యాలయం ఎదుట రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా కేటీపీఎస్ 5, 6, 7 దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు పాల్గొని పూజలు నిర్వహించారు. మాట్లాడుతూ... భారత రాజ్యాంగం ద్వారా దేశ ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేద్కర్ అన్నారు. ఆయన విగ్రహాన్ని కాలనీలో ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈలు ఎస్.యుగపతి, ఎం.శ్రీనివాసరావు, మోక్షవీర్, రాజ్‌కుమార్, బూర్గుల విజయ భాస్కర్‌రావు, నల్లబల్లి రాంబాబు, సంపత్, వెంకటేశ్వరరావు, వినయ్‌రాజ్, రాందాస్, రాధకృష్ణ, సత్యం, ఆర్.శ్రీనివాసరావు, తోట అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం..



మాట్లాడుతున్న సీతారామయ్య

టేకులపల్లి: కేంద్రం ప్రభుత్వం కార్మికవర్గం మనుగడకు ప్రమాదకరమైన విధానాలను రూపొందిస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను, పరిశ్రమలను, వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని ఇందులో భాగమే 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.సీతారామయ్య అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడితేనే కార్మికవర్గానికి మనుగడ ఉంటుందన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లిలో రెండు ఐఎఫ్‌టీయూల జిల్లా కమిటీల సమావేశం జరిగింది. 18న ఈ రెండు విలీన సభ సందర్భంగా జరిగిన ఈ జిల్లా కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఇఫ్టూ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే.సారంగపాణి, ప్రధాన కార్యదర్శిగా జే.సీతారామయ్య, ఉపాధ్యక్షుడిగా తోడేటి నాగేశ్వరరావు, డి.ప్రసాద్, మిడిదొడ్డి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఎండీ.రాసుద్దీన్, ఎస్.సంజీవ్, కొండపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా ఎం.మల్లికార్జున్ ఎన్నికయ్యారు.

ఇఫ్టూ సంఘాల విలీనంతో ఆనందోత్సాహాలు..

రెండు ఐఎఫ్‌టీయూ సంఘాలు శనివారం విలీనం కానుండటంతో కార్మికవర్గాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయని సంఘం రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్, జిల్లా నేత మరాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కేటీసీలోని బాడీ వాహనాల అడ్డా వద్ద కార్మికులతో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. భారత విప్లవానికి పురోగామి వర్గమైన కార్మికవర్గాన్ని సంఘటితపరిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగేష్, వెంకటేష్, రాంబాబు, వెంకన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న హరిప్రియ

టేకులపల్లి: మారుమూల గ్రామాల్లో బీఆర్ఎస్ మరింత బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని రాంపురం, కొత్తతండా (పి), తావ్యాతండా, తడికలపూడి, కోక్యాతండా, ముత్యాలంపాడు ఎక్స్ రోడ్డు, సులానగర్, మద్రాస్ తండా, బిల్లుడు తండా గ్రామాల్లో నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రచారం చేయాలని, బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో లక్కినేని సురేందర్‌రావు, బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలునాయక్, బానోత్ కిషన్, శివకృష్ణ, బానోత్ రవి, నాగేంద్ర, పాపా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఓకే.. ఆ ఇద్దరు ఏరి ?



వేదిక మీద మల్లిబాబు, దుర్గాప్రసాద్, మధుకర్‌రెడ్డి

2014లో కాంగ్రెస్ నుంచి ఇల్లెందు ఎమ్మెల్యేగా కోరం కనకయ్య గెలుపొందారు. నాడు ఆయన కోటరీలో మడత వెంకట్‌గౌడ్ (ఇల్లెందు), లక్కినేని సురేందర్ (టేకులపల్లి), మూల మధుకర్ రెడ్డి (బయ్యారం), మండ దుర్గాప్రసాద్ (గార్ల), మేకల మల్లిబాబు యాదవ్ (కామేపల్లి) కీలకం. ఆ తరువాత అందరూ బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. ప్రస్తుతం కనకయ్య రెండోసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముగ్గురు నేతలు కాంగ్రెస్‌లో ఆయన వెంట అడుగులు వేశారు. మరి.. మరో ఆ ఇద్దరు నేతలేరి అని స్థానికులు గుసగుస లాడుకుంటున్నారు. ఆ ఇద్దరు లక్కినేని సురేందర్, మడత వెంకట్‌గౌడ్ కాగా.. మడత మెడలో నేడో రేపో కాంగ్రెస్ కండువా పడనుంది. ఇక లక్కినేని సురేందర్ కారు దిగుతాడో.. లేదో చూడాలి. శుక్రవారం జరిగిన ఇరిగేషన్ సమీక్ష సమావేశంలో ఈ ముగ్గురు నాయకులు వేదికపై పక్కపక్కన కూర్చోగా ఈ చర్చ జరిగింది.

– ఇల్లెందు

మోహన్ భగవత్ దిష్టిబొమ్మ దహనం

కొత్తగూడెంరూరల్: నిజమైన స్వాతంత్ర్యం అయోధ్యలో రామమందిరం ప్రారంభమైన రోజున వచ్చిందన్న ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి భగవత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడారు. భగవత్ చేసిన వ్యాఖ్యల వలన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన సమరయోధులను కించపరిచే విధంగా ఉందని, వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణరెడ్డి, గులాం మతిన్, కుంచం వెంకటేష్, పల్లి ప్రవీణ్, తాటి పవన్, రాము, మద్దెల జయసూర్య, శివకుమార్, అల్లెపు రాజు, సాయిప్రకాశ్, మహేష్, రాహుల్, సందీప్, నవీన్ పాల్గొన్నారు.

సంస్థ బదిలీ చేస్తే.. అధికారుల అడ్డుకట్ట !

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ జనవరి 1 నుంచి మే 5వ తేదీ వరకు కార్మికులకు బదిలీలు, డిప్యూటేషన్లు లేవని డిసెంబర్ 31న సర్క్యులర్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో కార్మికులు పలురకాల పైరవీలతో అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగితే ఎట్టకేలకు బదిలీ చేస్తూ ఆర్డర్లను వివిధ ఏరియాలకు పంపించారు. కానీ ఆ ఆర్డర్లను వివిధ ఏరియాల జీఎంలు, హెచ్ఓడీలు కార్మికులకు ఇవ్వకుండా, రిలీవ్ చేయకపోవటంలో అంతర్యమేమిటని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వీరి హాజరు పరిస్థితి ఏంటని, డైరెక్టర్లు బదిలీ చేస్తే, అధికారులు నిలిపివేయటం సింగరేణి 135 సంవత్సరాల చరిత్రలో ఇదే మొదటిసారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాతకొత్తగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత కొత్తగూడెం, పెనుబల్లి, గంగబిషన్‌బస్తీ, గాంధీనగర్, గౌతంనగర్, నేతాజీ మార్కెట్ పెద్దబజార్, చిన్నబజార్, కూలీలైన్, గణేష్ బస్తీ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.